విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 29, ఏప్రిల్ 2025

భూములిచ్చిన రైతులందరికి
న్యాయం చేయాలి

విశాలాంధ్ర – కొలిమిగుండ్ల : సిమెంట్ పరిశ్రమలకు భూములు ఇచ్చిన రైతులందరికీ న్యాయం చేయాలని సిపిఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, సీనియర్ నాయకులు సంజీవులు లతో కలిసి సిమెంట్ పరిశ్రమల బాధిత రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. బాధిత రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూములు ఇచ్చిన తమకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు అన్నివేళలా అండగా ఉండేది ఎర్రజెండానే అని అన్నారు. రైతులు కార్మికులు పేదల సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కొలిమిగుండ్ల మండలంలోని 33గ్రామాలకు గాను 16 గ్రామాల రైతులు సిమెంట్ పరిశ్రమలకు భూములు ఇచ్చారన్నారు. దీంతో జీవనోపాధి కోల్పోయి రైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సిమెంట్ పరిశ్రమ యజమానులు పట్టించుకోవడం లేదన్నారు. రాంకో అల్ట్రాటెక్ పెన్నా తదితర సిమెంట్ పరిశ్రమ యజమానులు 16గ్రామాలను తమ గుప్పెట్లో పెట్టుకుని రైతుల పొట్ట కొట్టారన్నారు. భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఉపాధి కల్పించకుండా మోసం చేశాయన్నారు. సిమెంటు పరిశ్రమల నుండి వెలువడుతున్న కాలుష్యం వలన మిగిలిన గ్రామాలలోని రైతులకు కూడా పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొంది అన్నారు. రైతు కుటుంబాలకు న్యాయం చేసేంతవరకు సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. రాంకో సిమెంట్ పరిశ్రమ పరిధిలో ఎలాంటి వేలం వేయకుండా దేవాదాయ భూములను తీసుకోవడం ఎంతవరకు న్యాయమన్నారు. అందరూ కలిసికట్టుగా పోరాడితే న్యాయం జరుగుతుందని తెలిపారు. భూములు కోల్పోయిన రైతులందరూ న్యాయం జరిగే వరకూ పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.

మండల రైతు సంఘం నూతన కమిటీ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని వారి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా బి పుల్లయ్య, కో కన్వీనర్ గా గంగుల శ్రీకాంత్ రెడ్డి, సభ్యులుగా బాల పెద్దయ్య, చిన్న పెద్దయ్య,నాగేష్, సుబ్రహ్మణ్యం, చంద్ర మోహన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వినయ్ తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ సూర్యనారాయణ, ఏఐటీయూసీ మండల కన్వీనర్ మహేష్, ఆటో యూనియన్ నాయకులు కంబగిరి రాముడు, రంగా, సంజామల మండల రైతు సంఘం నాయకులు అబ్రహాం, ప్రతాపరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

30న బత్తిగుల్ ఉద్యమం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : "నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ" కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది అధ్యక్షతన డబ్రా మసీదు నందు జరిగిన మీడియా సమావేశంలో సోమవారం వారు మాట్లాడుతూ వక్ఫ్ చట్టం – 2025కి వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు మార్గదర్శకత్వంలో దేశవ్యాప్తంగా శాంతియుత నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. "బత్తి గుల్" కార్యక్రమంలో ఈనెల30వ తేదీ బుధవారం రాత్రి 9గంటల నుండి 9.15నిమిషాల వరకు లైట్ ఆర్పడం కూడా ఒక విధమైన పద్ధతిగా పరిగణించవచ్చనీ, ఇది మనం అన్యాయానికి వ్యతిరేకమని, మేము మేలుకుని ఉన్నామని, మా హక్కుల సాధన కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేసేందుకు సంకేతమని, బత్తి గుల్ చేయడం అనేది బలహీనత కాదు, ఇది మేము ముందుకు సాగుతామని, మా పోరాటాన్ని కొనసాగిస్తామని చూపించే సంకల్పమన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు మహమ్మద్ అబులైస్, కో కన్వీనర్ మస్తాన్, ఎస్డిపిఐ అధ్యక్షులు ఎజాస్ హుస్సేన్, ఇన్సాఫ్ అధ్యక్షులు బాబా ఫక్రుద్దీన్, మజీద్ ఖాన్, జేఏసీ యూత్ మెంబర్లు సమీర్, షేక్ అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

విశాలాంధ్ర – వెలుగోడు : విద్యతో పాటు, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులు మాత్రమే ఉజ్వల భవిష్యత్తు ఏర్పరచుకుంటారని మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మం నాయక్, గ్రంథాలయ శాఖ అధికారిని సుమలత పేర్కొన్నారు. వెలుగోడు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం సోమవారం ప్రారంభించడమైనది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా వెలుగోడు ఎంఈఓ బ్రహ్మం నాయక్ మాట్లాడుతూ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంకు విద్యార్థులు గ్రంథాలయానికి హాజరై ఇందులో నేర్పించేటువంటి కథలు చెప్పటం, కథలు చదవటం, పుస్తక సమీక్ష, డ్రాయింగ్ నేర్చుకొని తమ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. పదో తరగతి పరీక్షల యందు మండలంలో ప్రథమ స్థానం పొందిన జె.సాయిస్ఫూర్తి 596/600, వెలుగోడు మండలం ద్వితీయ స్థానం పొందిన చరణ్య 591/600 విద్యార్థులకు మేమెంటో శాలువతో సత్కరించడమైనది. ఈ కార్యక్రమం నందు లిటిల్ ఏంజెల్ స్కూల్ కరస్పాండెంట్ డా.ఇమ్మానియేల్, టీడీపీ నాయకులు డాక్టర్ జాకీర్,మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం,అమీర్ హంజా, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండో తేదిన మిమిక్రీ, నాట్య ప్రదర్శనలు

విశాలాంధ్ర – బనగానపల్లె : శ్రీ అరుణభారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2వ తేదీన మిమిక్రీ, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ అధ్యక్షులు, పట్టణ మాజీ సర్పంచ్ బిసి.రాజారెడ్డి తెలిపారు. సోమవారం బిసి రాజారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 2వ తేదీన బనగానపల్లె పట్టణం బిసి గుర్రెడ్డి కాలనీలోని ప్రియదర్శిని స్కూల్ ఎదురుగా అరుణ భారతి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మిమిక్రీ ప్రదర్శన, కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, సినిమా డబ్బింగ్ ఆర్టిస్ట్ ఎం.జితేంద్ర ఇప్పటికే 4వేలకు పైగా మిమిక్రీ ప్రదర్శనలు ఇచ్చారని, ఆయన తోటి బనగానపల్లెలో ప్రత్యేకంగా మిమిక్రీ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నామన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన షేక్ కరీముల్లా నటరాజ నృత్య కళామందిర్ వారిచే కూచిపూడి నాట్యం, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2వ తేదీ బుధవారం సాయంత్రం 6:30 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పట్టణ ప్రజలందరూ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

గంగమ్మ గుడి దగ్గర గడ్డి దగ్ధం

విశాలాంధ్ర – శిరివెళ్ల : మండల కేంద్రంలోని నాగుల చెరువు వెళ్లే దారిలో ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల మున్సిపల్ కార్పోరేటర్ ఖండే శ్యాంసుందర్ లాల్ తోట వద్దగల గంగమ్మ గుడి సమీపంలో సోమ వారం వరిగడ్డి దగ్ధం అయ్యింది. బొలెరో వాహనంలో రవాణా చేస్తున్న వరి గడ్డ దగ్ధం కావడం వల్ల వాహనం సైతం కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లినట్లు బాధిత వాహన యజమాని మరియు రైతు సుబ్బన్న రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమీప పొలాల్లో చెత్తాచెదారం కలుపు మొక్కలను కాల్చి వేస్తూ చెలరేగిన నిప్పురవ్వలు కారణమా లేక విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమా అన్నది తెలియాల్సి ఉన్నది.ఈ సందర్భంగా అధిక ఉష్ణోగ్రతలు ఒకవైపు పెనుగాలులు మరో వైపు ఉండడం వల్ల అగ్నికి ఆయువు తోడైతే క్షణాల్లో జరగరాని నష్టం జరుగుతుందని రైతులు పూరి గుడిసెల్లో నివసిస్తున్న ప్రజలు తగిన జాగ్రత్తగా అప్రమత్తగా ఉండాలని పలువురు సూచించారు.

మురికి కాలువలు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర – చాగలమర్రి : పట్టణంలోని కూలూరు రహదారి వెంట ఉండే కాలనీల్లో మురికి కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మని మురికి కాలువలను నిర్మించా లంటూ కాలనీ వాసులు గ్రామ పంచాయతీ కార్యాల యంలో ఈవోపీఆర్డి, ఈవో తాహీర్‌హుసేన్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ స్థానిక కూలూరు రస్తాలో ఓ వైపు ప్రధాన మురికి కాలువ మరో వైపు కచ్చా మురికి కాలువ ఉందని దీంట్లో మురికి నీరు పోకుండా నిల్వ ఉందన్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతూ ఫలితంగా దోమలు అధికమై కాలనీ ల్లోని ప్రజలు రోగాలబారిన పడుతున్నామని, ఈ కాలనీవాసులను కనుకరించాలని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

యాగంటి క్షేత్రంలో దర్శకుడు సుకుమార్

విశాలాంధ్ర – బనగానపల్లె : ప్రముఖ సేవ క్షేత్రం యాగంటి క్షేత్రంలోని ఉమామహేశ్వర స్వామిని ప్రముఖ తెలుగు చలనచిత్ర దర్శకుడు సుకుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం యాగంటి క్షేత్రానికి సుకుమారు వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. ఈయన పుష్ప వంటి పలు విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించారు.

నిమ్మసాగు
లాభసాటి

- ఎండలు పెరిగే కొద్ది లాభసాటి
- మే నెలలో మరింత పెరిగే అవకాశం
- ప్యాకెట్ ధర రూ.4 వేలు

విశాలాంధ్ర – చాగలమర్రి : వేసవి నిమ్మకాయలకు డిమాండ్ ఉంటుంది. ప్రజలు నిమ్మరసం ఇష్టంగా తాగుతారు షర్బత్, మజ్జిగ మొదలైన వాటిల్లో నిమ్మకాయలు ఉపయోగిస్తారు. నిమ్మలో సివిటమిన్ ఎక్కువగా ఉండటం వల్ల వినియోగం ఎక్కువే. ప్రస్తుతం 40 కిలోల నిమ్మకాయల బస్తా రూ.2,000నుంచి రూ.4వేలు నుంచి రూ.4,500 పలుకుతోంది. దిగుబడి. తక్కువగా ఉన్న ధరలు ఉండటంతో రైతులకు లాభసాటిగా ఉంది. నంద్యాల జిల్లాలో 597 హెక్టార్లలో నిమ్మసాగు చేశారు. ఆళ్లగడ్డ మండలంలో 11 ఎకరాలు పొగలమర్రి మండలంలో 130 ఎకరాలు, రుద్రవరంలో 20 ఎకరాలు, శిరివెళ్లలో 10 ఎకరాలు, దొర్నిపాడులో 5 ఎకరాలు నిమ్మ సాగు చేశారు. ఎగరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నిమ్మ తోటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల వద్ద మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. గత ఏడాది వరకు నిమ్మకాయలను వ్యాపారులు ప్రతి రోజు 300 బస్తాలను కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కడప, అనంతపురం, చిత్తూరు తదితర నగరాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం దిగుమతి తగ్గి పోవడంతో రోజు కేవలం 50 బస్తాలు మాత్రమే వస్తున్నాయి. ధరలు ఉన్న కాయలు సరిగా లేవని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో రూ.250 నుంచి రూ.300 వరకు మాత్రమే ఉన్న ఈ ధరలు ఈనెలలు అమాంతంగా పెరిగాయి.ధరలు పెరగడంతో ఇతర ప్రాం తాల నుంచి వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. కొందరు వ్యాపారులు అయితే పొలాల ను కౌలుకు తీసుకున్నారు. నెల క్రితం ధర లేక డీలా పడ్డ నిమ్మరైతులు ఇప్పుడు కాలం కలిసొచ్చిందని ఉన్న కాయలను కోసి విక్రయిస్తున్నారు.

> **శ్రీను, కౌలు రైతు..**
> నిమ్మకాయల ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మల్లేవేముల గ్రామంలో రెండున్నర ఎకరా నిమ్మతోటను కౌలుకు తీసుకొని నిమ్మసాగు చేస్తున్నా.. ధరలు బాగున్న కాయలు పలుచగా ఉన్నాయి. కోత కోసిన కాయలను చాగలమర్రి నుంచి ముంబాయికి ఎగుమతి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరింత ధర పెరిగే అవకాశం ఉంది.

రెండు కాయలు రూ.10 : గ్రామాల్లో పలువురు చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై నిమ్మకా యలను విక్రయిస్తున్నారు. కాయలు లావుగా ఉంటే రెండు నిమ్మకాయలను రూ.10వరకు విక్రయిస్తున్నారు. తోటల వద్దకు వెళ్లి రైతులు దగ్గర కొని విక్రయిస్తున్నారు.

ఈ మూడు నెలలే కీలకం : మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఈ పంటకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీంతో నిమ్మకాయల ధరలకు రెక్కలు వస్తాయని రైతులు తెలిపారు. ఏడారి పొడవునా పంట దిగుబడి వచ్చినా అశించిన ధరలు ఉండవు. వేసవి ప్రారంభం కావడంతోనే ధరలు పెరుగుతాయి. ఈ ఏడాది జనవరిలో ప్యాకెట్ నిమ్మకాయల ధర రూ.600 ఉండగా ఫిబ్రవరి వచ్చేసరికి ఏకంగా రూ.1500కు పెరిగింది. మార్చిలో రూ.2500కు చేరుకుంది. ప్రస్తుతం 4వేలు నుంచి రూ.4,500 వరకు ధర ఉంటోంది. మే నెలలో మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాకు 100 చెట్లు సాగు చేస్తే దిగుబడి 100 నుంచి 150 ప్యాకెట్ల వరకు వస్తుంది. సాధారణంగా ప్యాకెట్ సైజును బట్టి 800 నుంచి 1200 నిమ్మకాయలను లోడ్ చేస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలో పండే నిమ్మకాయలు నాణ్యతగా ఉండటంతో ఎక్కువ డిమాండ్ ఉంటోంది. ఈ ప్రాంతంలో పండిన నిమ్మకాయలను బెంగుళూరు, గోవా, ముంబాయి కేరళ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

వాడవాడలా ఏఐటీయూసీ జెండా ఎగరాలి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్ : మే డే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సుంకయ్య మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో 139 వ మేడే సందర్భంగా ఏఐటీయూసీ ఎర్రజెండాను ఎగరేయాలని కార్మిక ప్రదర్శనలు, సభలు జరిపి పాలకులు అవలంబిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపైన కార్మికులందరూ కదిలి కార్పొరేట్ సంస్థలకు కార్మిక శక్తి చూపించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నంద్యాల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు, డి.శ్రీనివాసులు మెడికల్ సంఘం నాయకురాలు సుశీలమ్మ, ట్రాలి ఆటో యూనియన్ నాయకులు రమణారెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

రైతుకు నష్టపరిహారం అందించాలి

విశాలాంధ్ర – నంద్యాల అర్బన్: గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామంలో షరీఫ్ అనే రైతు పంట పొలంలో పంట చేతికొచ్చే సమయంలో కొందరు పెద్దలు ఆ పంటలను నాశనం చేయడం దుర్మార్గమని ఇలాంటి చర్యలకు పాల్పడిన దుండగులను క్రిమినల్ కేసులు నమోదు చేసి నష్టపోయిన పంటకు ఎకరాకు రూ.50వేల నష్ట పరిహారం చెల్లించాలని సోమవారం సీపీఐ మండల కార్యదర్శి జి.హరి నాథ్, మండల సహాయ కార్యదర్శి జిలాని భాష డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోస్పాడు మండలం జూలేపల్లి గ్రామంలోని షరీఫ్ అనే రైతు వారి పూర్వీకుల నుంచి సంక్రమించిన పొలంలో పంట వేసుకోవడం జరిగిందన్నారు. ఈ పొలం విషయంలో గత కొన్నేళ్లుగా వివాదాలు ఉన్నాయని, అవి కోర్టు పరిధిలో కేసులు కూడా నడుస్తున్నాయని కానీ కోర్టు వారు అక్కడ పంటలు వేసుకునే అవకాశం షరీఫ్ అనే రైతుకు కల్పించడం జరిగిందని అన్నారు. కోర్టు అనుమతిలో భాగంగానే షరీఫ్ అక్కడ పంట వేసుకోవడం జరిగిందని పంట దాదాపుగా పది రోజుల్లో కోతకు వస్తుందనగా షరీఫ్ కి వ్యతిరేకులుగా ఉన్నవారు కొందరు రాత్రికి రాత్రి పంట పొలంలోకి పశువులను తోలి పంటను నాశనం చేయడం అమానుషమన్నారు. వెంటనే పోలీసు అధికారులు, రెవిన్యూ అధికారులు ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

బంగారు కుటుంబాలను గుర్తించాం

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : పి4 సర్వే ద్వారా గుర్తించిన 43,021 బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు మార్గదర్శులను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ పేదరికాన్ని నిర్మూలించేందుకు గాను పి4 (ప్రజా-ప్రైవేట్-ప్రజల భాగస్వామ్యం) సర్వే చేసి రాష్ట్రంలో ఉన్న సంపన్నులను మార్గదర్శులుగా, అత్యంత పేదవారిని బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి అవసరమైన చేయూతను ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 43,021 బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. జిల్లా పరిధిలో ఉన్నత స్థాయి వ్యక్తులను గుర్తించి మార్గదర్శులుగా నమోదు చేయాలని మండల తహశీల్దార్లను, మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అధికారులు కూడా మార్గదర్శి కుటుంబాలను స్ఫూర్తిగా తీసుకొని బంగారు కుటుంబాలకు చేయూత ఇవ్వాలని కోరారు. ఇందులో భాగంగానే రెడ్ క్రాస్ సంస్థ వారు చెంచు కుటుంబాలను ప్రోత్సాహం ఇచ్చేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు.

బ్లడ్ స్టోరేజ్ యూనిట్ ప్రారంభం : జిల్లా కేంద్రంలో కెనాల్ కాంపౌండ్‌లోని మైనర్ ఇరిగేషన్ కార్యాలయంలో త్వరలో రక్త నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీలో వెయ్యి రూపాయలు చెల్లిస్తే జీవిత కాలం సభ్యత్వం ఉంటుందని, 12 వేలు చెల్లించి వైస్ ప్యాట్రాన్‌గా, 25 వేలు చెల్లించి ప్యాట్రాన్ గా ఉండే అవకాశం ఉందని, ప్యాట్రాన్, వైస్ ప్యాట్రాన్ కు ప్రెసిడెంట్ చేతుల మీదుగా సర్టిఫికేట్, మిగతా వారికి గవర్నర్ చేతుల మీదుగా సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారులు వెయ్యి రూపాయలు, ఆధార్ కార్డు, 2ఫోటోలు ఇచ్చి శాశ్వత సభ్యత్వం పొందాలన్నారు. సభ్యత్వం పొందిన వారికి అవసరమైనప్పుడు లేదనకుండా బ్లడ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అప్కాస్ కు సంబంధించి ఒప్పంద ప్రాతిపదికిన సిబ్బందిని నియమించుకోవడానికి అధికారులు నేరుగా ఫైల్ ను జిల్లా ఇంచార్జి మంత్రి పంపుతున్నారని అలా కాకుండా జిల్లా కలెక్టర్ నుండి ఫైల్ పంపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ క్షేత్ర స్థాయిలో తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజల నుండి వివిధ రకాల వినతులు ఇవ్వడం జరుగుతుందని వాటిని కూడా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

హత్య చేసిన వారిని ఆరెస్ట్ చేయాలి

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : కాంగ్రెస్ పార్టీ ఆలూరు అసెంబ్లీ ఇన్చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఆళ్లగడ్డ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బరుగొడ్ల హుస్సేన్ భాషా, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి శంసుల్ హక్ డిమాండ్ చేశారు. సోమవారం వారు చిప్పగిరికి వెళ్లి లక్ష్మీనారాయణ మృతదేహానికి నివాళులు అర్పించి అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీనారాయణ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉరుసుకు సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు

విశాలాంధ్ర – వెలుగోడు : ఎంతో ఘన చరిత్ర కలిగిన రోఖియాబి ఉరుసు మహెూత్సవాన్ని మే నెల 1, 2తేదిలలో ఘనంగా నిర్వహించటానికి పట్టణంలో దర్గా కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. వెలుగోడులోని రోఖి యాబి ఉరుసు ప్రతి సంవత్సరము అత్యంత వైభవంగా జరుగుతుంది.దూర ప్రాంతాల నుండి భక్తులు వచ్చి ధూప దీప నైవేద్యములు సమర్పించి తరిస్తున్నారు. శ్రీమతి రోఖియాబి దువ వల్ల భక్తుల కోరికలు తప్పకుండా నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తున్నారు. ఒకటవ తేదీన గంధం, రెండవ తేదీన ఉర్సు మహెూత్సవము జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అనేక పోటీలు జరుగుతాయని కమిటీ నిర్వాహకులు తెలిపారు. గుండు, చందా, సైకిల్ పందాలు, ఎద్దుల చేత బండలాగుడు పోటీలు, భక్తులను అలరారించే ఖవ్వాలి ప్రదర్శన కూడా ఉంటుందని అన్నారు. ముఖ్యఅతిథిగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి పాల్గొనాలని సోమవారం ఆహ్వానించారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : స్వయం ఉపాధి మైనారిటీ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ అసెంబ్లీ కార్యాలయంలో పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు మైనార్టీల సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమక్షంలో మైనార్టీల స్వయం ఉపాధిని పెంపొందించేందుకు సబ్సిడీ రుణాల కొరకు రూ.342 కోట్లు నిధులను కేటాయించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్వయం ఉపాధి కొరకు ఒక్క సబ్సిడీ రుణాన్ని కూడా అందించకుండా మైనార్టీ ప్రజలను దగా చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 25వేల మందికి స్వయం ఉపాధి కొరకు సబ్సిడీ రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని నంద్యాల ప్రజలు ఉపయోగించుకునేలా వారికీ అవగాహన కల్పించి వీలైనంత ఎక్కువమందికి సబ్సిడీ రుణాలను అందించేలా కృషి చేయ్యాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కౌన్సిలర్లు, 42 వార్డుల ఇంచార్జ్ లు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర – బనగానపల్లె : బనగానపల్లె శాఖ గ్రంథాలయం నందు సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను గ్రంథాలయ అధికారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి ఉపాధ్యాయులు విశ్రాంత రాములు, నందవరం గణిత ఉపాధ్యాయులు ఏవీఎస్ గోవిందయ్య పాల్గొని అమూల్య కథానికలతో పిల్లలకు బోధించారు. గ్రంథాలయాధికారి బషీర అహమ్మద్ మాట్లాడుతూ గ్రామములో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపించి ఈ సమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరమ్ జాయింట్ కన్వీనర్‌గా బైరెడ్డి శబరి

విశాలాంధ్ర బ్యూరో – నంద్యాల : ఇండియన్ మెడికల్ పార్లమెంటేరియన్స్ ఫోరమ్ జాయింట్ కన్వీనర్‌గా నంద్యాల ఎంపి, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరిని భారత ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, ఇండియన్ మెడికల్ పార్లమెంటరియన్స్ ఫోరమ్ చైరపర్సన్ జగత్ ప్రకాష్ నడ్డా ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పార్లమెంట్ సభ్యులకు భారతదేశంలో ప్రజారోగ్య సమస్యలను పరిష్కరించడంలో అచంచలమైన అంకితభావం, విశేషమైన సహకారాన్ని అందించినందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర – రుద్రవరం : మండల కేంద్రంలోని బెస్త కాలనీలో ఉన్న జనార్ధన్ అలియాస్ జన (42) విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాల మేరకు జనార్ధన్ గత 20సంవత్సరాల నుంచి గ్రామంలో కేబుల్ ఆపరేటర్‌గా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. సోమవారం బెస్త కాలనీ వైపు వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ తీగలను సరిచేసేందుకు సంబంధితలైన్ మాన్ జనార్ధన్‌తో విద్యుత్ తీగలను సరిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ గురై జనార్ధన్ స్తంభం పైనుంచి కింద పడ్డారన్నారు. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే రుద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు అన్నారు. అక్కడ చికిత్స అనంతరం 108వాహనంలో నంద్యాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడన్నారు. మృతునికి భార్య విజయలక్ష్మి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. విద్యుత్ సిబ్బంది ఎల్సీ తీసుకోకుండా ఇలా పనులు చేయించడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లైన్మెన్ ఉండి కూడా ఇతరులతో పనులు చేయించడం పట్ల గ్రామస్తులు మండిపడుతున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంతో పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆళ్లగడ్డలో జాబ్ మేళా

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని అనంత డిగ్రీ కళాశాలలో వచ్చే నెల ఐదవ తేదీన నిర్వహించనున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తాలూకా టీడీపీ సీనియర్ నాయకుడు భార్గవ్‌రామ్ అన్నారు. సోమవారం పట్టణంలోని స్వగృహంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, అనంత డిగ్రీ కాలేజీ కరస్పాండెడ్ అనంత రామసుబ్బారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా భార్గవ్ రామ్‌తో కలిసి జాబ్ మేళాకు సంబంధించిన పాంప్లెట్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో వచ్చే నెల 5వ తేదీన 15కంపెనీలతో 990 జాబ్స్‌తో మెగా జాబ్ మేళా అనంత డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆళ్లగడ్డ తాలూకాలోని నిరుద్యోగ యువతీ యువకులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోని వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని భార్గవ్ రామ్ తెలిపారు. కార్యక్రమంలో ఆళ్ల నాగ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు

www.visalaandhra.com

కర్నూలు, మంగళవారం 29, ఏప్రిల్ 2025

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పొగాకును రైతుల నుండి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీరైతుసంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ దర్నానుద్దేశించి ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడ్ హాజరై మాట్లాడుతూ గత సంవత్సరం బర్లి పొగాకుకు ధరలు ఆశాజనకంగా ఉండడంతో ఈ సంవత్సరం కూడా రైతులు జిల్లాలో కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, ఆస్పరి, వెల్దుర్తి, కృష్ణగిరి, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ప్రాంతాలలో రైతులు విస్తారంగా సాగుచేశారన్నారు. ఐటీసీ, జీపీఐ ఆలయన్స్ కంపెనీలు రైతులను ప్రోత్సహించి పొగాకు పంటను వేయించారని, పొగాకును రైతుల నుండి క్వింటానికి రూ.15 వేల ప్రకారం అగ్రిమెంట్ చేసుకొని పంట చేతికి వచ్చిన తర్వాత ఆ ధర కొనలేమని చేతులెత్తేశారన్నారు. ఏజెంట్ల ద్వారా నాలుగు వేల రూపాయలు ప్రకారం కొంటామని లేకపోతే కొనలేమని కొనుగోళ్లు ఆపివేశారని తెలిపారు.ఆదుకోవలసిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతుల పండించిన పూర్తి సరుకును కొనుగోలు చేయడం లేదన్నారు. బర్లి పొగాకును క్వింటానికి రూ.18 వేల ప్రకారం ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను కలెక్టర్ రంజిత్‌బాషకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డి.రాజా సాహెబ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు పరమేశ్వర్ రెడ్డి, బసాపురం గోపాల్, కారన్న, కోసిగి గోపాల్, ఉమాపతి, కారన్న, వెల్దుర్తి కృష్ణ, డి.రాజు, గిడ్డయ్య, అల్లా బకాష్, మాధవి, రబియా, పోతమ్మ, ఆదాము, బీసన్న పర్లి పొగాకు రైతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను ఓపిగ్గా వినాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పీజీఆర్ అర్జీలను నాణ్యంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందని, ఇందుకు సంబంధించి పోలీస్ శాఖలో 1400, డీఆర్ఓ 1100, ఏడి సర్వేయర్ 540, డ్వామా పిడి 50, హౌసింగ్ పీడీ 67, వ్యవసాయ శాఖ 79, డీఎంహెచ్ఓ వద్ద 97 పెండింగ్ ఉన్నాయని, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఎక్కువ సంఖ్యలో అర్జీల ఆడిట్ పెండింగ్ ఉందని, త్వరితగతిన వీటిని ఆడిట్ చేసి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి సివిల్ సప్లైస్, అన్న క్యాంటీన్, రెవెన్యూ, సర్వే, వైద్యం, మైనింగ్ తదితర శాఖల మీద ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారని, ఇందుకు సంబంధించి మొదటిసారి ఫిర్యాదు వచ్చినపుడు సంబంధిత వ్యక్తిని పిలిపించి మాట్లాడాలన్నారు. రెండు సార్లు రిపీట్ ఐతే జాయింట్ కలెక్టర్, మూడుసార్లు అయితే జిల్లా కలెక్టర్ మాట్లాడతారన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఫీడ్‌పై మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి లోపాలు ఏవైనా ఉంటే సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో అధికారులు ప్రజలతో ఏ విధంగా మాట్లాడుతున్నారు, ప్రజల సమస్యలను ఓపికతో వింటున్నారా లేదా అని వివరాలు తీసుకుంటున్నారని, మద్దికెర, హోళహర్వి, వెల్దుర్తి మండలాల తహశీల్దార్‌లు ప్రజల సమస్యలు ఓపిగ్గా వినలేదని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో గోనెగండ్ల, మద్దికెర, హాలహర్వి, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ అంశాల పై సమీక్షలు ఎప్పటికపుడు నిర్వహించుకోవాలని కలెక్టర్ డీఆర్ఓ, సెట్కూరు సీఈఓను ఆదేశించారు. అధికారులు ప్రజలతో బాగా మాట్లాడి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, వారి నుండి సానుకూల స్పందన పొందేలా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సిఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: నగర శివారులోని వెంకటేశ్వర నగర్, కస్తూరీ నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ నగర సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటేశ్వరనగర్‌లో రోడ్లు సరిగా లేక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కస్తూరి నగర్‌లో డ్రైనేజి సౌకర్యం లేకపోవడంతో మురికి నీరు నిలిచి పోవడంతో అక్కడ దుర్గందమైన కంపుకొడుతుందన్నారు. నీరు నిల్వ ఉండటం వలన దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిందన్నారు. వెంటనే అక్కడ సౌకర్యాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ముజఫర్ నగర్ రబియా షరీఫ్ నగర్ మాధవి, మోహన్, బాబురావు, మల్లికార్జున, ఆదాము ఉన్నారు.

వలసల నివారణకై ఉపాధి పనులు

విశాలాంధ్ర - తుగ్గలి: మండల పరిధిలోని ఎల్లమ్మ గుట్ట తండాలో ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలో ఉపాధి హామీ పని దినాలు పూర్తి కావడంతో ఉపాధి కోసం వైజీ తండాలోనే గిరిజనులు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ పనులు చేసుకుంటూ కుటుంబ పోషించుకునేవారని అందుకే వలసలు నివారించేందుకు ఉపాది పనులు కల్పించడమైనదని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస నాయక్ అన్నారు. ప్రస్తుతము నూతన ఆర్థిక సంవత్సరం రావడంతో కొత్త పని దినాలును ప్రభుత్వం కల్పించింది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ నాయక్ ఉపాధి హామీ పనులను ఎల్లమగుట తండాలోనే గిరిజనులకు కల్పించారు. దీంతో తండాలోనే గిరిజనులందరూ ఉపాధి హామీ పనులకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు.

అటో, బొలేరో ఢీ.. ఒకరు మృతి

విశాలాంధ్ర-పెద్దకడబూరు: మండల పరిధిలోని హనుమాపురం గ్రామ శివారుల్లో జాతీయ రహదారిపై సోమవారం బొలేరో వాహనం ఆటో ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. ఏఎస్ఐ ఆనందు వివరాల మేరకు.. జాతీయ రహదారిపై బొలేరో వాహనం వెనుక నుంచి ముందుకు వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొంది. దీంతో పూతలపట్టు గ్రామానికి చెందిన సుమతి (45) మృతి చెందింది. ఆటో డ్రైవర్ ధరణి, మరో మహిళకు తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెల్లడించారు.

హామీల అమలుపై చిత్తశుద్ధిలేని ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : సీపీఎస్, జీపీఎస్ విధానాన్ని సమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని, మెరుగ్గైన పీఆర్సీ అమలుచేస్తామని, ప్రభుత్వం వచ్చిన వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని, బకాయిల చెల్లింపు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన ప్రభుత్వం, ఆచరణలో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ రెడ్డి ఆరోపించారు. ఎస్టీయూ కర్నూలు జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు ఎస్.గోకారి అధ్యక్షతన ఎస్టీయూ భవన్ కర్నూల్ నందు నిర్వహించడం జరిగింది. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 12వ పిఆర్సీ ఇప్పటికే 22 నెలల ఆలస్యమైనందున వెంటనే పిఆర్సి కమిటీ నియమించాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, ఆర్థిక బకాయిల చెల్లింపుకు ప్రభుత్వం రోడ్ మ్యాప్ ప్రకటించాలని కోరారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వొద్దు

విశాలాంధ్ర - నందవరం: గ్రామాల్లో ఎట్టి పరిస్థితుల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో 45 రోజులు పాటు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటే, వేసవికాలం ముగుస్తుందన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడంలో విఫలమయ్యారు: మాత శిశు సంక్షేమ శాఖ అధికారులు బాల్య వివాహాలను అరికట్టడంలో పూర్తిగా విఫలమయ్యారని నాగలదిన్నె ఎంపీటీసీ అత్తావుల్ల అన్నారు. మూడు నెలలకోసారి సమావేశంలో వచ్చి కనపడుతున్నారని, మిగతా సమయంలో కనపడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సూపర్వైజర్ సుచరిత మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడం తన ఒక్కరి బాధ్యత కాదని, మండల స్థాయి అధికారులందరి బాధ్యతన్నారు.

శాంతియుతంగా దేవర జరుపుకోవాలి:ఎస్ఐ

విశాలాంధ్ర - నందవరం: కనకవీడు గ్రామంలో వచ్చే నెల అంటే వచ్చే 6, 7 తేదీల్లో పెద్దమ్మ, మారెమ్మ అవ్వల దేవరను శాంతియుత వాతా వరణంలో జరుపుకోవాలని ఎస్ఐ ఎం.కేశవ తెలిపారు. సోమవారం గ్రామ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలను, గ్రామ నాయకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా శాంతియుత వాతావరణములో దేవర కార్యక్రమాన్ని జరుపుకోవాలని, వ్యక్తిగత కారణాలతో గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎలాంటి సమస్య ఉన్న పోలీసులకు తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని, దేన్నైనా వ్యక్తిగతంగా తీసుకొని గొడవ సృష్టించకూడదని సూచించారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషం

విశాలాంధ్ర - పెద్దకడబూరు : పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానుషమని బీవీఎస్ మండల కార్యదర్శి లక్ష్మన్న ఖండించారు. సోమవారం పెద్దకడబూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్‌లో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉగ్రవాదులు ఎక్కడున్నా వారిని పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు. శాంతియుత భావంతో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలసి జీవిస్తున్న మన దేశంలో ఇలాంటివి జరగడం దురదృష్టకరమని, దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పది ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని కృష్ణానగర్‌లో ఉన్న గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థి విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ డిమినెల అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థి విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో వివేక్ 583, పూజిత 582, శ్రీనివాసులు 579, దివ్య తులసికి 570 మార్కులు వచ్చాయన్నారు. ప్రతి విద్యార్థికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి విద్యార్థులు మంచి స్థానాల్లో నిలిచి ఉన్నంత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో గాయపడ్డ వ్యక్తి మృతి

విశాలాంధ్ర - కోడుమూరు: మండలంలోని పులకుర్తి గ్రామంలో శనివారం మధ్యాహ్నం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన వ్యక్తి ఆదివారం తెల్లవారు నిద్రలోనే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మునిస్వామి వర్గీయులు, బజారి వర్గీ యుల మధ్య ఘర్షణ జరిగింది. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన బజారి వర్గీయు లలోని నడిపి రంగన్న వురఫ్ నడిపోడు (35) అనే వ్యక్తి మృతి చెందడం జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన మేరకు.. పులకుర్తి గ్రామం లో శనివారం కొందరు యువకులు ఘర్షణ పడ్డారు. ఈ దాడుల్లో నడిపి రంగన్న అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థాని కులు, కుటుంబ సభ్యులు కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. అనంతరం గ్రామంలో జరిగిన ఘటనపై కోడుమూరులోని స్థానిక పోలీస్ స్టేషన్ చేరుకొని గొడవపై ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రలోనే మృతి చెందాడు. గమనించిన భార్య మల్లీశ్వరి 108 సిబ్బందికి సమాచారం ఇవ్వగా, ఘటనా స్థలానికి చేరకున్న వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అయినప్పటికీ బతికే ఉంటాడన్న ఆశతో హుటాహుటీన ఆటోలో కోడుమూరులోని స్థానిక ప్రభుత్వాసు పత్రికి తరలించగా, వారు సైతం మృతి చెందినట్లు వెల్లడిం చారు. మృతుడు నడిపి రంగన్నకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఓ కుమారుడు సంతానం. భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ కోడుమూరు చేరుకొని పులకుర్తి ఘర్షణలో జరిగిన దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన నడిపి రంగన్న మృతదేహాన్ని పరిశీలించారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరిస్తున్నట్లు కర్నూలు బారాసోసియేషన్ అధ్యక్షులు హరినాథ్ చౌదరి ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లో జరిగిన సంఘటన హిందువులపై ఉగ్రవాదులు జరిపిన సంఘటనలో చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలుపుతూ ఒకరోజు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు వారు తెలిపారు.

బకాయి వేతనాల చెల్లింపునకు కృషి చేస్తాం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: నగరపాలక సంస్థలో పనిచేస్తున్న 24 మంది పారిశుద్ధ్య కార్మికుల ఆరు నెలల వేతనాలు మూడేళ్ల నుండి పెండింగ్లో ఉన్నాయి, వాటిని మంజూరు చేయండి అంటూ కేఎంసీ వర్కర్స్ యూనియన్ నాయకులు వైవీ రమణ, ఎంవీ నారాయణల విజ్ఞానకు స్పందించిన కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, వేతనాల చెల్లింపునకు కృషి చేస్తామని హామీనిచ్చారు. సోమవారం నగరపాలక కార్యాల యంలో కేఎంసీడబ్ల్యూయూ నాయకులు, కార్మికులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. కాగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 17 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అర్జీదారులకు హామీ నిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ఓ జునైద్, ఎంఈలు శేషసాయి, సత్యనారాయణ, టీపీఆర్ఓ వెంకట లక్ష్మి, పారిశుద్ధ్య పర్యవేక్ష అధికారి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ స్థాయి సప్ హ్యాక్ పేస్ట్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: నగరంలోని అశోక్ ఉమెన్స్ కళాశాల లో జాతీయస్థాయి సప్ హ్యాక్ పేస్ట్ సోమవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విఘ్నేశ్వరన్, దీపిక లింగరాజ్ హాజరై వారు మాట్లాడుతూ బెంగళూరులో ప్రధాన కార్యాలయంలో ఉన్న ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ షావ్ బెంగళూరుకు చెందిన జిల్ వన్ కంపెనీలతో కలిసి సప్ హ్యాక్ పేస్ట్ అనే జాతీయ స్థాయి హ్యా కదథాన్ నిర్వహించారు. సమాజంలో ఉన్న కిష్టమైన గుర్తించి వాటికి కొత్త పరిజ్ఞానంతో పరిష్కారాలను అందించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రోత్సహించారు. మొత్తం 125 బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ ప్రతిభను చూపించారు. మూడు ప్రధాన అంశాలపై సవాలను స్వీకరించి, పరిష్కారాలను రూపొందించారు. వ్యాపా రంలో ఏ వన్ మోడల్‌లో నైతికత డీజిల్ మోసాలను నివారణ స్థిరమైన వ్యాపార మోడల్ విద్యార్థులు తమ పరిష్కారాలను రూపొందించి నిపుణులకు ముందు సమ ర్పించారు. విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవడమే కాకుండా సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో ఎంతో సహాయపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో అశోక్ ఉమెన్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటుపై హర్షం

విశాలాంధ్ర-తుగ్గలి: మండల పరిధిలోని రాతన గ్రామంలో చలివేంద్రాన్ని సోమవారం సర్పంచ్ అన్వర్ భాష ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో చలి వేంద్రాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు చలి వేంద్రం ప్రారంభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.మాజీ సర్పంచ్ మనోహర్ చౌదరి, ఎంపీడీవో విశ్వ మోహన్, పంచాయతీ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య అంత్యక్రియలు

విశాలాంధ్ర- చిప్పగిరి: ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చిప్పగిరి లక్ష్మీనారాయణ అంత్యక్రియలను భారీ పోలీసుల బందోబస్తు మధ్య నిర్వహించారు. లక్ష్మీనారాయణ హత్యను దృష్టిలో ఉంచుకొని చిప్పగిరి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో భారీ పోలీసుల బందోబస్తు నిర్వహించారు. సోమవారం గుంతకల్ ప్రభుత్వ హాస్పిటల్ నందు చిప్పగిరి లక్ష్మీనారాయణ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. చిప్పగిరి అంబేద్కర్ సర్కిల్ నందు లక్ష్మీనారాయణ మృతదేహాన్ని ఉంచి ఉంచి హత్య చేసిన నిందితులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలంటూ, అదేవిధంగా మృతిని కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కల్పించాలని, ఐదు ఎకరాల పొలమును ఇవ్వాలని దళితుల నాయకులు డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనం తరం మృతదేహాన్ని స్వగృహానికి తీసుకవెళ్లి అక్కడ నుండి అంతిమయాత్ర కొనసాగించారు.

చిప్పగిరిలో పర్యటించిన జిల్లా ఎస్పీ: లక్ష్మీనారాయణ హత్య జరిగిన సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం పరిశీలించారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై జిల్లా ఎస్పీ ఆరా తీశారు. జిల్లా ఎస్పీతో పాటు ఆదోని ఒన్‌టౌన్ సీఐ శ్రీరామ్, చిప్పగిరి ఎస్సై సతీష్, మంత్రాలయం ఎస్సై శివాంజల్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: లక్ష్మీనారాయణ హత్యకేసు నిందితులను కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి మూలింటి మారెప్ప, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల తిరుపాల్, కాంగ్రెస్ పార్టీ పత్తికొండ నియోజక వర్గం ఇంచార్జీ క్రాంతి నాయుడు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మీనారాయణ మృతదేహాన్ని నాయ కులు పరామర్శించి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీనారాయణను గుర్తుతెలియని దుండగులు అత్యంత దారుణంగా హతవ ార్చడం విడ్డూరమైన చర్యగా అభివర్ణించారు. లక్ష్మీనారాయణ హత్యకు కారకు లైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. లక్ష్మీనారాయణ ఆత్మకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి : సీపీఐ

విశాలాంధ్ర - కర్నూలు: కరోనా సందర్భంగా రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను, ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించేందుకు కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు,కర్నూలు నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డిలు కోరారు. ఆదివారం సీపీఐ ప్రతినిధి బృందం కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజును సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, కర్నూలు నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, నగర నాయకులు వి.గోవిందు, కార్యవర్గ సభ్యులు యు.కుమార్, భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) జిల్లా కోశాధికారి పి.దస్తగిరి, సీపీఐ నాయకులు బంటుపల్లి సురేంద్ర కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు మాట్లాడుతూ నిరంతరం కరువు కాటకాలతో అత్యంత వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో, పూర్వ ఆంధ్ర ప్రదేశ్ రాజధాని కర్నూలు నుండి నేటి రాజధాని విజయవాడకు, కోస్తా, ఉత్తరాంధ్ర, ప్రాంతాలకు సౌకర్యంగా ఉండే విధంగా నడుస్తున్న రైళ్లను కరోనా సందర్భంగా రద్దు చేసి నాలుగు సంవత్సరాలు గడిచినా తిరిగి పునరుద్ధరించ లేదన్నారు. దీంతో ప్రతినిత్యం విధులు నిర్వహించే ఉద్యోగులు, చిరు వ్యాపారులు, వ్యాపారులు చదువుకునే విద్యార్థులు, చిరు ఉద్యోగాలు చేసుకుంటున్న యువకులు, రైతులు, వ్యవసాయ వలస కూలీలు, పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రోడ్డు సౌకర్యం సక్రమంగా పట్టణాలకులేని ప్రాంతాల్లో నడిచే బెంగళూరు, హుబ్లీ నుండి గుంటకల్ మీదుగా డోన్, నంద్యాల మీదుగా నడిచేటువంటి రైళ్లు రద్దు చేయడం ద్వారా ప్రతి రోజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు రైల్వే అధికారులకు ప్రజలు విజ్ఞప్తి చేసినప్పటికీ సౌకర్యం తిరిగి పునరుద్ధరించక పోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ విషయమై పార్లమెంటు సభ్యులుగా కేంద్ర రైల్వే శాఖ మంత్రితో, రైల్వే శాఖ ఉన్నతాధికారులతో చర్చించి రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించి ప్రజలకు సౌకర్యం కలిగించాలని కోరారు. ప్రధానంగా ప్రస్తుతం కరోనా తర్వాత ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌గా నడుస్తున్న హుబ్లీ- విజయవాడ రైల్ నెంబర్ 17329, విజయవాడ- హుబ్లీ రైల్ నెంబర్ 17330లను ప్యాసింజర్‌గా మార్పు చేసి, బెంగళూరు కంటోన్మెంట్- విజయవాడ రైల్ నెంబర్ 56504, విజయవాడ- బెంగళూరు కంటోన్మెంట్ రైలు నెంబర్ 56503ప్యాసింజర్ రైళ్లను పాత సమయానికి తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. ప్రతిరోజు ఉదయం గుంతకల్లు నుండి ఉదయం 5 గంటలకు బయలుదేరే గుంటకల్- కర్నూల్ రైలును కర్నూలు -గుంటకల్-బళ్లారి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించి పాత సమయానికి నడపాలన్నారు. ప్రస్తుతం నంద్యాల నుండి వయా డోన్ మీదుగా ప్రస్తుతం కర్నూల్ నడుస్తున్న రైలు నెంబర్ 77210ను డోన్ మీదుగా అనంతపురం వరకు పొడిగించాలన్నారు. పూర్వ రాజధాని కర్నూలు నగరం నుండి మచిలీపట్నం నెంబర్ 07068, మచిలీపట్నం- కర్నూలు ఎక్స్‌ప్రెస్ రైలు 07067, కర్నూలు - కాకినాడ, కాకినాడ -కర్నూల్ నగరం ఎక్స్‌ప్రెస్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలి. ప్రస్తుతం నడుస్తున్న మహబూబ్ నగర్ - విశాఖపట్నం 12862, విశాఖపట్నం - కర్నూలు 12861ను డోన్ జంక్షన్‌కు పొడగించి నడపాలని విన్నవించారు. హుబ్లీ నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ నెంబర్ 17226, నరసాపూర్ టు హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైల్ నెంబర్ 17225 ను పారిశ్రామిక పట్టణం బేతంచెర్లలో హాల్టి ఏర్పాటు చేయాలన్నారు. డోన్ రైల్వే జంక్షన్ లో అన్ని ప్లాట్ఫారంలను కలుపుతూ వృద్ధులు, దివ్యాంగుల ప్రయాణ సౌకర్యం కోసం లిఫ్టను, రోప్ వేను ఏర్పాటు చేయాలని కోరారు. వృద్ధులకు, జర్నలిస్టులకు రైలు ప్రయాణంలో ఇచ్చే రాయితీలను తిరిగి పునరుద్ధరించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 06:30 గంటలకు డోన్ నుండి బయలుదేరే గుంటూరు ప్యాసింజర్‌ను 5 నెంబర్ ప్లాట్ఫారం నుండి నడవడం వల్ల గూడ్స్ రైల్లు ఆగడం వల్ల లగేజ్‌తో ప్లాట్ ఫారంకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర సౌకర్యంగా ఉన్నందున 1వ నెంబర్ ప్లాట్ ఫారం నుండి బయలుదేరే విధంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు.

వచ్చే నెల 15వ తేదీలోగా పొగాకు కొనుగోలు చేయాలి : జేసీ

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వచ్చే నెల 15వ తేదీ లోపు పొగాకు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య పొగాకు కంపెనీలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పొగాకు కొనుగోలుపై కంపెనీల ప్రతినిధులు, జిల్లా వ్యవసాయాధికారి, ఏడీ మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతూ పొగాకు కొనుగోలు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, అలా కాకుండా మంచి ధర ను ఇవ్వాలని సూచించారు. పూర్తిగా పొగాకు పంటను మే 15 తారీఖులోపు కొనుగోలు చేయాలని జేసీ పొగాకు కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. సిరి పొగాకుకు సంబంధించి కొనుగోలు కేంద్రాన్ని ఓర్వకల్లులో ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాలని జీపీఐ కంపెనీలను ఆదేశించారు. బీడి పొగాకు, నాటురకం పొగాకును సైతం పూర్తిగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయంపై పొగాకు కంపెనీ ప్రతినిధులతో మరొక సమావేశం నిర్వహించి జిల్లాలో పండించిన పొగాకును పూర్తిగా, మంచి ధరలతో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఏడీ మార్కెటింగ్ నారాయణమూర్తి, సహాయ వ్యవసాయ సంచాలకులు సాలు రెడ్డి, కర్నూలు డివిజన్ మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

తాత్కాలిక చైర్మన్‌గా ఎంఎంజీ గౌస్

విశాలాంధ్ర - ఆదోని : ఆదోని మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా ఎంఎంజీ గౌస్ నియమించినట్లు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సమక్షంలో జరిగిన అవిశ్వాసంలో అప్పటి చైర్ పర్సన్ శాంతపై వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాసం నెగడం జరిగిందని తెలిపారు. తదానంతరం ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌కు తాత్కాలిక చైర్మన్ ఎన్నికపై వైస్ చైర్మన్‌లు ముల్లా మహమ్మద్ గౌస్, నరసింహుల పేర్లను ఉన్నతాధికారులకు పంపడం జరిగిందన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం మొదటి వైస్ చైర్మన్‌గా ఎన్నుకోబడిన ముల్లా మొహమ్మద్ గౌస్‌ను తాత్కాలిక మున్సిపల్ చైర్మన్‌గా నియమిస్తూ మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్ ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. వైసీపీకి చెందిన వైస్ చైర్మన్‌లలో ఎవరికి అవకాశం వస్తుందోనని ఉన్న ఉత్కంఠకు తెరపడిందని చెప్పవచ్చు. ఇకనుంచి అయినా పట్టణంలో నెలకొన్న సమస్యలపై, అభివృద్ధి పనులపై తాత్కాలిక చైర్మన్ ముల్లా మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో వైసీపీ కౌన్సిలర్లు ఏ స్థాయిలో పని చేస్తారని ప్రజలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు, వివిధ పార్టీ నాయకులు వేచి చూస్తున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 29, ఏప్రిల్ 2025

రీఓపెన్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి స్వీకరించిన 32,796 దరఖాస్తులలో ఇప్పటివరకు 30,985 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్వో రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన విజ్ఞప్తులలో ఇప్పటివరకు 30,985 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. రీఓపెన్ అయిన 59 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధించిన అధికారులను ఆదేశించారు. పెండింగ్లో ఉన్న 1811 దరఖాస్తులను వితిన్ ఎస్ఎల్ఎ లోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిష్కార స్థితిపై కొత్త ట్యాగ్ విధానాన్ని రూపొందించడం జరిగిందని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా పెండింగ్‌లో ఉన్న 157 మిస్సింగ్ ఎంప్లాయిస్ డేటా, సిటిజన్ ఈ-కేవైసీ, 637 వర్క్ ఫ్రం హెూం డేటా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్లో ఉన్న మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 24శాతం మంది మాత్రమే మొబైల్ యాప్ వినియోగిస్తున్నారని ఇంటింటికి వెళ్లి మొబైల్ ఉన్న ప్రతి ఒక్కరి చేత నంబర్ సేవ్ చేయించి, హాయ్ అని మెసేజ్ పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రజల సమస్యలను ఓపిగ్గా వినాలి : జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: పీజీఆర్ అర్జీలను నాణ్యంగా పరిష్కారం అయ్యాయా లేదా అని ఆయా శాఖల జిల్లా అధికారులు ఆడిట్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యా దుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల పరి ష్కారంపై అధికారులతో సమీక్షించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను ఆడిట్ చేయాల్సి ఉందని, ఇందుకు సంబంధించి పోలీస్ శాఖలో 1400, డీఆర్ఓ 1100, ఏడి సర్వేయర్ 540, డ్వామా పిడి 50, హౌసింగ్ పీడీ 67, వ్యవసాయ శాఖ 79, డీఎంహెచ్ఓ వద్ద 97 పెండింగ్ ఉన్నాయని, కర్నూలు, ఆదోని, ఎమ్మి గనూరు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఎక్కువ సంఖ్యలో అర్జీల ఆడిట్ పెండింగ్ ఉందని, త్వరితగతిన వీటిని ఆడిట్ చేసి పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ సేవలకు సంబంధించి సివిల్ సప్లైస్, అన్న క్యాంటీన్, రెవెన్యూ, సర్వే, వైద్యం, మైనింగ్ తదితర శాఖల మీద ప్రజల నుండి ఫీడ్ బ్యాక్ తీసుకుంటు న్నారని, ఇందుకు సంబంధించి మొదటిసారి ఫిర్యాదు వచ్చినపుడు సంబంధిత వ్యక్తిని పిలిపించి మాట్లాడాలన్నారు. రెండు సార్లు రీపీట్ ఐతే జాయింట్ కలె క్టర్, మూడుసార్లు అయితే జిల్లా కలెక్టర్ మాట్లాడతా రన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ ఫీడ్‌పై మండలాల వారీగా సమీ క్షలు నిర్వహించి లోపాలు ఏవైనా ఉంటే సరిదిద్దేలా చర్యలు తీసుకో వాలని కలెక్టర్ ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లను ఆదేశించారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో అధికారులు ప్రజలతో ఏ విధంగా మాట్లా డుతున్నారు, ప్రజల సమస్యలను ఓపికతో వింటున్నారా లేదా అని వివరాలు తీసుకుంటున్నారని, మద్దికెర, హాళ హర్వి, వెల్దుర్తి మండలాల తహశీల్దార్‌లు ప్రజల సమ స్యలు ఓపిగ్గా వినలేదని ప్రజలు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో గోనెగండ్ల, మద్దికెర, హాలహర్వి, కర్నూలు అర్బన్ మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఈ అంశాల పై సమీక్షలు ఎప్పటికపుడు నిర్వహించు కోవాలని కలెక్టర్ డీఆర్ఓ, సెట్కూరు సీఈఓను ఆదేశించారు. అధికారులు ప్రజలతో బాగా మాట్లాడి, వారి సమ స్యలను పరిష్కరించే విధంగా కృషి చేసి, వారి నుండి సానుకూల స్పందన పొందేలా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సిఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించా లని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అలరించిన విద్యార్థుల శాస్త్రీయ నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : విజయవాడ మహానగరం న్యూ కన్వెన్షన్ హాల్ నందు సత్యకాలం పుస్తకావిష్కరణ కార్యక్రమం నందు నంద్యాల పట్టం ఎన్జీవో కాలనీ నందుగల శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థుల జాతీయత, దేశభక్తి భావాలను ప్రతి బింబించే శాస్త్రీయ నృత్య ప్రదర్శన అతిధులను ఆహుతులను అబ్బుర పరిచింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ విద్యార్థులకు జ్ఞాపిక అందజేసి వారి నృత్య ప్రదర్శనలను ప్రశంసించారని స్కూల్ డైరెక్టర్ పి.షేక్షావలి రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని తాలుకా టీడీపీ సీనియర్ నాయకులు భార్గవ రామ్ అన్నారు. పట్టణంలోని స్వగృహంలో సోమవారం సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను భార్గవ్ రామ్ అందజే శారు. ఆళ్లగడ్డ మండలం పెద్ద చింతకుంట్ల గ్రామానికి చెందిన మిద్దె ఇస్మాయిల్‌కు రూ.1.40 లక్షలు, బాచేపల్లె గ్రామానికి చెందిన దేవ మ్మకు రూ.2.75 లక్షల విలువగల చెక్కులను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు తీసుకున్న బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులకు, సీఎం నారా చంద్ర బాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి ఉన్నారు.

ఉమా మహేశ్వర స్వామికి పల్లకి సేవ

విశాలాంధ్ర - బనగానపల్లె: మండల పరిధిలోని యాగంటి శ్రీ ఉమా మహేశ్వర స్వామి దేవస్థానం నందు సోమవారం సందర్భముగా ఉమామహేశ్వర స్వామికి పల్లకి సేవ ఆలయ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం నందు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేష్ రెడ్డి, యాగంటిపల్లె ఉప ఉప సర్పంచ్ మౌళీశ్వర రెడ్డి, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ రాజారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

విశాలాంధ్ర - బనగానపల్లె : మహా కుంభాభిషేక వజ్రోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా బనగానపల్లె నియోజకవర్గంలోని కోవెలకుంట్ల పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి దేవస్థానం నందు మే నెల 4 తేదీ నుండి 8 తేదీ వరకు నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు సోమవారం నాడు బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డికి కోవెలకుంట్ల ఆర్యవైశ్య సంఘం పెద్దలు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆర్య వైశ్యులు ఐక్యంగా ఉండి అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని బీసీ రాజారెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కోవెలకుంట్ల మండి మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇస్కాల ప్రసాద్, జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు పెండేకంటి నాగరాజు, గౌరవ సలహా అధ్యక్షులు కాల్వ కార్తీక్, నాగయ్య, కర్నాటి అభిలాష్ పాల్గొన్నారు.

గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మండలంలోని బల్లెకల్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ వివరించారు. ఈ నెల 26న కృష్ణమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా బల్లెకల్ గ్రామంలో పర్యటన చేపట్టిన సందర్భంగా గ్రామ ప్రజలు నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వాల్మీకి, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని, సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మారుతి, మహాదేవ, సాదిక్ వలి, బాబురావు, ఓంకార్, ఎల్లప్ప, బంగారు బాబు, సవరయ్య, లక్ష్మీనారాయణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులుగా శేఖర్, ఈరన్న.

విశాలాంధ్ర - పెద్దకడబూరు: బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షులు అంజి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు రంగముని ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గం కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా కంబలదిన్నె గ్రామానికి చెందిన బోయ శేఖర్‌ను, కార్యదర్శిగా చిలకలడోణ గ్రామానికి చెందిన ఈరన్నను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోయ వాల్మీకు లను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు తమ పోరాటాలు చేస్తామన్నారు. బోయ వాల్మీకుల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎస్టీ రిజర్వేషన్ కోసం విద్యార్థి, యువకులు, ఉద్యోగులు, రైతాంగం, మేధావులను కలుపుకొని పోరాడుతామన్నారు.

సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను ఉపయోగించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: గ్రంధాలయ శాఖ బి-క్యాంప్, కర్నూలు నందు వేసవి పునశ్చరణ కార్యక్రమం ఏర్పాటు - రాష్ట్ర ప్రభుత్వ పౌర శాఖ గ్రంధాలయం వారి పిలుపు మేరకు పాఠశాల విద్యార్థులకు ఈ నెల 28-04-2025 నుండి 06-06-2025 వరకు ఎస్. వెంకటేశ్వర్లు, గ్రంధాలయధికారి వారి ఆధ్వర్యంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, ఒకేషనల్ కాలేజీ సీనియర్ కంప్యూటర్ లెక్చరర్ రామకృష్ణ, రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ రామచంద్రన్, కేశవయ్య, వన్నూర్ సాహెబ్ పాల్గొ న్నారు. గ్రంధాలయ శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ పౌర శాఖ వారి ఉత్తరవులమేరకు పాఠశాల విద్యార్థులకు సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్స్ జరుగుతాయాని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కవులు లేదా రచయితలు వ్రాసిన పుస్తకాన్ని గ్రంధాలయం అంటారు. ఈ గ్రంధాలయాన్ని సరస్వతి నిలయం అంటారని, ఈ గ్రంధాలయాన్ని ఉపయోగించుకోవడం వలన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సిబ్బంది, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాజా హుస్సేన్ మృతి బాధాకరం

విశాలాంధ - బనగానపల్లె: పట్టణంలోని ఖాజీ వాడ కాలనీకి చెందిన అమాలి ఖాజా హుస్సేన్ (75) (ఖాజీ వాడ మసీద్ మోజన్) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఖాజా హుస్సేన్ మృతదేహానికి నివాళ్లులు అర్పించి వారి కుట్టుంభానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ అల్తాఫ్, గోపాల్, హాజి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు విలువలు పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: విద్యార్థులు విద్యతో పాటు విలువలు, సామాజిక సేవ దృక్పథం పెంపొందించుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. స్థానిక నగరంలోని టీజీవీ కళా క్షేత్రం నందు విద్య అకాడమిలో పాలిటెక్నిక్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు కల్చరల్ అండ్ మోటివేషన్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యా శాఖ అధికారి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా చదువుకుంటే విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరు కుంటారని అన్నారు. పాలిటెక్నిక్ చదవడం ద్వారా ఉన్నతమైన ఉద్యోగాలు పొంది చిన్న వయసులోనే స్థిరపడవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో విద్య అకాడమి డైరెక్టర్ కె.వెంకటేశ్వరమ్మ, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ అడ్వకేట్ కోనేటి వెంకటేశ్వర్లు, విద్యావేత్తలు డాక్టర్ కేవీ సుబ్బా రెడ్డి, జి.పుల్లయ్య, డాక్టర్ కొట్టే చెన్నయ్య, కార్తీక్ నాయుడు, రఘు వీర్, బాల రాజు, చింతలపల్లి రామకృష్ణ, టి.గోపీనాథ్, అంచ పెద్దస్వామి, బుర్రా చంద్ర మోహన్, సురేంద్ర బాపూజీ, ముద్దం మధు సుదన రావు, రిటైర్డ్ ఆర్టీవో కోనేటి చంద్రబాబు, ప్రముఖ జర్నలిస్టు వడ్ల శ్రీకాంత్, రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ సాన మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు

సమ్మర్ ఓరెంటియేషన్ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర - ఆదోని రూరల్: పట్టణంలోనే పాత ఓల్డ్ బ్రిడ్జి సమీపంలో ఉన్న గ్రంథాలయంలో సమ్మర్ ఓరెంటియేషన్ కార్యక్రమన్ని లైబ్రరీయన్ అధికారి సుజాత ప్రారంభించారు. నవోదయ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ హరికృష్ణ సరస్వతి దేవి చిత్రపటానికి పూల మాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంతి ఉద్యోగి శార దమ్మ ఉపాధ్యాయులు తెలుగు పండిట్ మల్లికార్జున, నరసింహులు,రమేష్ పలువురు హాజరయ్యారు. నవోదయ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ హరికృష్ణ మాట్లాడు తూ గ్రంధాలయాలు విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే నిలయాలన్నారు. ఎంతో విజ్ఞాన సంపద మన గ్రంథాలయ ఉందిని, వేసవి సెలవులు ఉన్నందున విద్యార్థిని విద్యార్థులు ఈ వేసవి పునశ్చ రణ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పుస్తకాలు చదవ డం ద్వారా చక్కటి జీవన విలువలు నేర్పించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతాయన్నారు. గ్రంథాల అధికా రిణి సుజాత మాట్లాడుతూ గ్రంథాలయం వేసవి పునశ్చరణ కార్యక్రమము మొదటి రోజు ఘనంగా వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలును వేసవి పునశ్చరణ కార్యక్రమము నకు పంపించుటకు ప్రోత్సహించాలని తెలిపారు. వేసవి పునరుచ్చరణ విద్యార్థులకు వివిధ ఆక్టివిటీస్ నేర్పించి వారిలో సృజనాత్మక పెంపొందించడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో రికార్డ్ అసిస్టెంట్ దేవేంద్ర, గాయత్రి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

పహల్గాం దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : ఫహల్గాం దాడికి నిరసనగా నంద్యాల పట్టణం నబినగర్, ఫాతిమా మజీద్ దగ్గర కొవ్వొత్తుల ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనారి టీస్ ఫైనాన్స్ కార్పొరేష న్ చైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ చేయడం జరిగిందనీ, కోట్ల మంది హిందువులు పరమ పవిత్రంగా భావించే అమ ర్నాథ్ యాత్రకు ఆటంకం కలిగించడమే దాడుల ముఖ్య ఉద్దేశమన్నారు. 38 రోజులపాటు కొనసాగే ఈయాత్ర జులై 3నుంచి ప్రారంభం కానుందనీ, భక్తుల భద్రత కొరకు ఇండియన్ ఆర్మీ ఏకంగా 60 వేల కంటే ఎక్కువ మంది జవాన్లతో బందోబస్తు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. భక్తులు ఎలాంటి భయం లేకుండా అమ ర్నాథ్ యాత్రకు వెళ్లి క్షేమంగా ఇంటికి తిరిగి చేరుకోవాలని అల్లాతో దువా కోరారు.

ఆర్యవైశ్య సంఘంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : ఆత్మకూరు ఆర్యవైశ్య భవనం నందు నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బింగిమల్ల శ్యాంసుందర్, జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు ఖండే శ్యాంసుందర్ లాల్, నందికొట్కూరు ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు వీరబొమ్మ నాగ సత్య నారాయణ, బొగ్గరపు జనార్దన్, ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నరహరి సత్య నారాయణ సమక్షంలో ఆత్మకూరు మండల సంఘం అధ్యక్షులుగా సెగు కిరణ్ కుమార్‌ను, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్‌గా దొంతు నరేష్‌ని, ప్రధాన కార్యదర్శిగా గోళ్ళ సత్య నారాయణ ని మరియు కోశాధికారిగా దొంతు సురేష్ చే ప్రమాణ స్వీకారం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్యవైశ్య సంఘం జిల్లా పెద్దలు మరియు,నాయకులు,పట్టణ ఆర్యవైశ్యులు, యువకులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అందరూ సేవా దృక్పథంలో, అన్ని రంగాలలో ఎల్లప్పుడూ ముందుండాలని పలువురు నేతలు ఆకాంక్షించారు. ఆర్యవైశ్యులందరూ ఒకే తాటిపై ఉండి ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కోగలమని ఉద్ఘాటించారు.

సుదర్శన వర్మ, నాగిరెడ్డిల ఆశయాలను కొనసాగిద్దాం

విశాలాంధ్ర - వెలుగోడు: కామ్రేడ్ సుదర్శన వర్మ కామ్రేడ్ నాగిరెడ్డిల వర్ధంతి సమావేశం మహమ్మద్ రఫీ అధ్యక్షతన జరిగినది. ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఏసురత్నం, సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్, నాగేంద్రు డు, రిటైర్ లెక్చరర్ రవికుమార్, మాజీ ఎంపీపీ ఎల్లాల కృష్ణుడు, సుదర్శన వర్మ, నాగిరెడ్డిల సమాధుల దగ్గర వారి సమాధులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ సీనియర్ నాయకులు వై.నాగేంద్రుడు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ సుదర్శన వర్మ, కామ్రేడ్ నాగిరెడ్డి పేదల కోసం కష్టజీవుల కోసం వారి జీవితాంతం పని చేశారని, కమ్యూనిస్టు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కృషి చేశారన్నారు. కామ్రేడ్ సుదర్శన వర్మ వెలుగోడు సర్పంచ్, నాగిరెడ్డి అబ్దుల్లాపురం సర్పంచ్‌గా అనేక సంవత్సరాలు పనిచేశారు. పేదలకు భూములు పంపిణీ చేశారు. కమ్యూనిస్టు విలువలకు కట్టుబడి కష్టజీవుల రాజ్యం కోసం కృషి చేశారు. వీరి ఎదుగుదలను చూడలేక కాంగ్రెస్ గుండాలు బాంబులు వేసి చంపడం జరిగినది. వ్యక్తులుగా వారిని చంపడం మాత్రమే చేశారు గానీ వారి ఆశయాలను చంప లేకపోయారు. ఎర్రజెండా ఉన్నంతకాలం కష్టజీవుల గుండెల్లో వారు బ్రతికే ఉంటారని వారన్నారు. ప్రజలు మరింత ఐక్యతతో బూర్జువా పార్టీల పెట్టుబడి దారి సిద్ధాంతాలకు వ్యతిరేకంగా కష్టజీవుల హక్కుల కోసం సోషలిజం స్థాపన కోసం మరింత పోరాటాలు చేయాల్సి ఉంటుందని కామ్రేడు సుదర్శన వర్మ నాగిరెడ్డిల ఆశయాలను ముందుకు తీసుకొని పోయి బూర్జువా, భూసామ్య పార్టీలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని, అప్పుడే వారికి నిజమైన నివాళి అని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండలనాయకులు నాగ మోహన్, వెంకటయ్య, కిషోర్, కృష్ణ, ఎర్రబాష, వలి బాష, నబి రసూల్, రహంతుల్లా మోదిన్ బాష, నూరుల్లా, శివ ప్రవీణ్, దేవరాజు, ముర్తు జావలి, కరిముల్లా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అధ్యాపకుడు వీవీఎస్ కుమార్

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఉత్తమ అధ్యాపకుడు, వివాద రహితుడు డాక్టర్ వీవీఎస్ కుమార్ అని రాయలసీమ యూనివర్సిటీ వీసీ, క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ ఆచార్య వి.వెంకట బసవరావు అన్నారు. సోమవారం క్లస్టర్ యూని వర్సిటీ కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల సిబ్బంది క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్య కుమార్‌లి సేవా విరమణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ ఆచార్య వి.వెంకటప్రసారావు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ డాక్టర్ వివిఎస్ కుమార్ ఇచ్చిన ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహించారని విద్యార్థులకు బోధన, బోధ నేతర సిబ్బందికి అందరికీ మంచిగా సేవలందించారని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆనందంగా గడవాలని, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ఉండాలని కోరారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కట్టావెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్లస్టర్ యూనివర్సిటీ అభివృద్ధిలో పాలు పంచుకున్నారని అన్నారు. కళాశాలలో ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించే వారిని అన్నారు. కళాశాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడుతూ, కాలేజియేట్ విభాగంలో జాయింట్ డైరెక్టర్ గా పనిచేసి కెవిఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రిన్సిపల్ సేవలందించార న్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యా ర్థులు, విశిష్ట అతిథులు పాల్గొని డాక్టర్ సుబ్రహ్మణ్య కుమార్ భవిష్యత్ జీవితానికి శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.దేవికరాణి, డాక్టర్ ఎం.పద్మావతి, డాక్టర్ ఎంసీ సాహిత్య, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వినడం వల్ల విజ్ఞానం

విశాలాంధ్ర - శిరివెళ్ల: కథలు వినడం వలన విజ్ఞానం పెరుగు తుందని శిరివెళ్ల శాఖ గ్రంథాలయ అధికారి కే సుజాత అన్నారు. చదువు పట్ల శ్రద్ధ పెరుగుతుందని పిల్లలు కథల పుస్తకాలు చదవడం వినడం వలన చదువులో శ్రద్ధ పెరుగుతుందని తద్వారా విజ్ఞానం పెరిగి ప్రతిభావంతులు అవుతారని అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా సోమవారం నాడు విద్యార్థులను కథల పుస్తకాలను చదివతం కథలు వినడం కథలలోని నీతిని చిన్నారుల నుండి రాబట్టడం జరిగిందని గ్రంథాలయ అధికారిని సుజాత అన్నారు. గ్రంథాలయ బాట పట్టిన చిన్నారులు పాఠశాలకు సక్రమంగా హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ప్రముఖులు పాల్గొన్నారు

మృతికి సంతాపం

విశాలాంధ్ర- బేతంచర్ల : బేతంచర్ల అగ్రిగోల్డ్ అసోసియేషన్ మండల కోశాధికారి జి.కోదండ రాముడు తల్లి జి.మల్లమ్మ (65) సోమవారం అనారోగ్యం తో మృతి చెందారు.విషయం తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి వై.భార్గవ్ మండలంలోని బలపాలపల్లె గ్రామంలోనీ వారి ఇంటికి వెళ్లి, పూల మాలలు వేసి, మృతురాలు కుటుంబానికి సానుభూతి తెలిపి, నివా ళులర్పించారు.నివాలర్పించిన వారిలో సహాయ కార్యదర్శి డి.దస్తగిరి, పట్టణ కార్యదర్శి వి.నాగరాజు, అగ్రిగోల్డ్ నాయకులు జి.రమణయ్య, సిపిఐ నాయకులు తాలూకా మదిలేటి, మారుతి, తది తరులున్నారు.